# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 7, మార్చి 2026






# విద్యుత్తు ఉచ్చులకు బలవుతున్న అటవీ జంతువులు..

వేమనపల్లి, మార్చి 06, ప్రభాతవార్త:

జిల్లాలో వన్యప్రాణుల వేట మళ్లీ మొదలైంది. చెన్నూరు డివిజన్ పరిధిలోని నీల్వాయి అటవీ ప్రాంతాల్లో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసి వేటగాళ్లు అటవీ జంతువులను బలి తీసుకుంటున్నారు. అటవీ మార్గాలు, నీటి వనరుల, పంట పొలాల సమీపంలో తీగలు అమర్చడంతో.. పందులతో పాటు ఇతర ప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల కాలంలో కేతనపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చులకు అడవి పంది బలి అయింది. దానికి ముందు బద్దెవెల్లి శివారులో వన్యప్రాణులను వేటాడే ముఠాను పట్టుకున్నారు. ఈ ఘటన తర్వాత అటవీశాఖ నిఘా పెంచినప్పటికీ.. వేటగాళ్ల చెర నుంచి వన్యప్రాణులను కాపాడలేకపోతున్నారు. వేటగాళ్లు మాంసం కోసం పక్షులు, జింకలు, పందులు, కుందేళ్ళు వంటి వాటిని చంపుతున్నారు.



2లో..




## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# విజయవంతంగా నిర్వహించాలి

✦ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నిర్మల్, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి (జిల్లా ఇన్ చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి జూపల్లి, ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి, ఎంపీ గోడం నగేష్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ క్షేత్రస్థాయిలో మెరుగ్గా అందాలన్న ఉద్దేశ్యంతో ఖ(ప్రజా పాలన ప్రగతి ప్రణాళికగ(గ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 99 రోజులపాటు, అన్ని శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుధ్య పనులు చేపట్టాలని వివరించారు. పెండింగ్ లో ఉన్న ఫైల్స్ లను పరిష్కరించాలని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు మిగతా 2లో..

# వైద్య విద్య అభివృద్ధి కొరకు సకల సదుపాయాలు కల్పిస్తాం




★ పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ

హాజీపూర్, మార్చి 6, ప్రభాతవార్త

ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలలలో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల కొరకు సకల సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట ప్రాంతంలో గల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల కొరకు ఏర్పాటుచేసిన బస్సులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు రేఖ, జగతీ దేవి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎం.పి. నిధుల నుండి 2 బస్సులు, డి.ఎం.ఎఫ్.టి. నిధుల నుండి 1 బస్సు మొత్తం 80 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చి వైద్య విద్య మిగతా 2లో..

# ప్రజలందరూ భాగస్వాములు కావాలి

✪ మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్య



చెన్నూరు, మార్చి 6, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి మంత్రి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, కౌన్సిలర్లు ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్తు ఉచ్చులకు బలవుతున్న అటవీ జంతువులు..

(మొదటిపేజీ తరువాయి)

వన్యప్రాణుల హక్కు చట్టం1972 చట్టం ప్రకారం వాటిని చంపడం, చర్మాలు, మాంసం విక్రయించడం నేరం. అయినా కొందరు అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు అమర్చి, ఉచ్చులు ఏర్పాటు చేసి హతమార్చుతున్నారు. వన్యప్రాణులను చంపితే 37 ఏళ్ల పాటు జైలు శిక్షతోపాటు రూ.25 వేల వరకు జరిమానా విధిస్తారు. కఠిన చట్టాలున్నా సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించకపోవడం కూడా నేరాలకు కారణమవుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా వేమనపల్లి మండలంలో ఏటా ఘటనలు చోటుచేసుకుంటున్న అధికారుల చర్యలు కానరావడం లేదనే విషయం స్పష్టమవుతోంది.



## గతంలో జరిగిన ఘటనలిలా..

2025 ఫిబ్రవరిలో నీల్వాయి బస్టాండ్ సమీపంలో తనిఖీలు చేయగా కల్మలపేట గ్రామానికి చెందిన తోకల జీవన్ వద్ద అడవి పిల్లి, కుందేలు కళేబరం, చుక్కల దుప్పి తల, ఇతర భాగాలతో పట్టుబడ్డాడు. 2026 ఫిబ్రవరిలో బద్దెవెల్లి శివారులో పంట పొలాల ప్రాంతంలో విద్యుత్ తీగను అమర్చి వన్యప్రాణులను హతమార్చే నిందితులను పట్టుకున్నారు. 2026 మార్చిలో కేతనపల్లి శివారులో పంట పొలాల్లో కరెంటు తీగలు అమర్చి అడవి పందిని హతమార్చి ఇంట్లో వండుకున్న పంది మాంసాన్ని పట్టుకున్నారు. నేందుగురి నారాయణ, గురుండ్ల వసంత్ నిక్కురి బాపు ల కేసులు నమోదయ్యాయి. 2026 మార్చి 06న కేతనపల్లి గ్రామానికి చెందిన పెరుగని రాజకుమార్, బొద్దున శ్రీకాంత్ హనుమాండ్ల సంతోష్ ముగ్గురు కలిసి కల్మలపేట్ శివారులో కరెంట్ తీగలు అమర్చి చుక్కల దుప్పినీ హతమార్చారు. ముగ్గురిపై కేసు నమోదు చేయాగా పెరిగాని రాజ్ కుమార్ ను ఈ నెల 18 వరకు ఆసిఫాబాద్ జైలుకు రిమాండ్ కు తరలించడం జరిగింది. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారు.

## వన్యప్రాణులను వేటాడుట చట్టరీత్య నేరం:

**- చెన్నూరు డివిజన్ ఫారెస్ట్ అధికారి సర్వేశ్వర్**

వన్యప్రాణులను వేటాడే ఘటనలు పునామృతం అవుతున్న సందర్భంగా శుక్రవారం చెన్నూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి సర్వేశ్వర్, నీల్వాయి రేంజ్ అధికారి హాఫీజోద్దీన్, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, ఆధ్వర్యంలో కల్మల్ పేట కేతనపల్లి శివారులో తనిఖీలు చేసి విద్యుత్ తీగలను అమర్చడం వన్యప్రాణులను వేటాడుట చట్టరీత్యా నేరమని కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.

## సంరక్షణకు పటిష్ట చర్యలు:

**- హాఫీజోద్దీన్, అటవీ రేంజ్ అధికారి, నీల్వాయి**

వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. వేటగాళ్ల నుంచి రక్షించేందుకు అటవీప్రాంతంలో పలుచోట్ల నిఘా నేత్రాలు (క్యాచ్ ద ట్రాప్)లు ఏర్పాటు చేశాం. బీట్, సెక్షన్ అధికారులతో తనిఖీలు చేపడుతున్నాం.

# వైద్య విద్య అభివృద్ధి కొరకు సకల సదుపాయాలు కల్పిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అభ్యసిస్తున్నారని, వైద్య విద్య అనేది ప్రత్యేకమైనదని తెలిపారు. చదువుకోవడం అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ఉన్నత చదువులు అభ్యసించి ఆదర్శంగా నిలవాలని, ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవ అందించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కొరకు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. గడిచిన 2 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రామగుండం, బెల్లంపల్లి, రేచిని ఇతర ప్రాంతాలలో ఓవర్ బ్రిడ్జిలు, ఇతర అభివృద్ధి కొరకు అనుమతులు పొంది పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తూ అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని, మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు నిలుపడం ద్వారా రైల్వే శాఖకు ఈ ప్రాంతం నుండి అధిక ఆదాయాన్ని సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని పటిష్టపరిచి అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, విద్యార్థులు ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో చదివి దేశంలో మంచిర్యాల ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని, ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని, తద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, విద్యార్థుల కొరకు త్వరలోనే స్పోర్ట్స్ కిట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల కొరకు నూతన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 1 వేయి మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. వైద్య విద్య కొరకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్, మెటీరియల్, ఫ్యాకల్టీ ఇతర అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన బస్సులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇటీవల వరుసగా జరిగిన పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల కారణంగా ఆలస్యం జరిగిందని అన్నారు. ప్రభుత్వం నుండి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వైద్య విద్య ఎంతో ఖర్చుతో కూడుకుందని, అర్హత గల విద్యార్థులకు ప్రభుత్వం విద్య అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య విద్యను పూర్తి చేసి సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్ఓడి శ్రీకాంత్, ఎ.డి. తులసీదేవి, డిసిసి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు



మందమర్రి, మార్చి 6, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మందమర్రి పట్టణంలోని సి.ఈ.ఆర్. క్లబ్‌లో మహిళల కోసం వివిధ ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి ఏరియా సేవ అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ హాజరై మహిళలందరికీ ముందస్తుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా బాంబ్ ఇన్ బ్లాస్ట్, త్రో బాల్, గ్రూప్ డాన్స్‌లు, స్కిట్ వంటి పోటీలు నిర్వహించారు. మందమర్రి ఏరియాలోని సుమారు 200 మంది మహిళలు, సింగరేణిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ సెల్, సేవాసమితి కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఆర్. సత్యనారాయణ, సీనియర్ పీఓలు, మహిళా ఉద్యోగులు, చుట్టుపక్కల ప్రాంతాల మహిళలు, సేవ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# విజయవంతంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులన్నీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, వైద్యారోగ్య కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన, అరైవ్ అలైవ్ కార్యక్రమం, తదితర కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సంయుక్త భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణను స్వయంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్ రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు: మేయర్ ధర్ని మధుకర్

**- అల్లూరి సీతారామరాజునగర్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన**

నస్పూర్, మార్చి 6, ప్రభాతవార్త



నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడవద్దు, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్ హెచ్చరించారు. శుక్రవారం మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని 32వ డివిజన్ అల్లూరి సీతారామరాజు నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమంలో భాగంగా నగరంలో చేపట్టిన కాలువల పూడికతీత, చెత్త తొలగింపు పనులను స్వయంగా పర్యవేక్షించారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, మురుగు కాలువల్లో చెత్త వేయకూడదని సూచించారు. గృహాలు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాల వ్యర్థాలను రోడ్లపై వేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీధి దీపాల మరమ్మత్తులు, మురుగు కాలువల శుభ్రత పనులను నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా ప్రజలు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపతి తిరుపతి, రెంక రవి, నాగిరెడ్డి రాజు, రవి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తా..

**- సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కౌన్సిలర్ ఏతం వంశీకృష్ణ**

చెన్నూరు, మార్చి 6, ప్రభాతవార్త



మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని 18వ వార్డు కౌన్సిలర్ వంశీకృష్ణ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీ లోని 18వ వార్డు కౌన్సిలర్ ఏతం వంశీకృష్ణ డీఎంఎఫ్ టీ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వ సహకారంతో విడతల వారీగా పనులు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.




## నిర్మల్ వండర్ ల్యాండ్‌లో యూట్యూబర్లు, ఇన్ఫ్లుయెన్సర్లకు ఉచిత ప్రవేశం

**నిర్మల్, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త:**

నిర్మల్ వండర్ ల్యాండ్‌లో మార్చి 8న యూట్యూబర్లు, ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్లకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ డాక్టర్ కత్తి కిరణ్, చలనచిత్ర కళాకారుల సంఘం అధ్యక్షులు ఆడిచర్ల రాజు, హరిహర ఈవెంట్స్ సాయి, యూట్యూబర్ కమలాకర్, విసిఎన్ ఛానల్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ వండర్ ల్యాండ్ యాజమాన్యం మాట్లాడుతూ.. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లను సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. ఉచిత వాటర్ రైడ్స్‌తో పాటు కంటెంట్ రూపొందించుకోవడానికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం 9908770788, 8919393069 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ వండర్ ల్యాండ్ రానాపూర్ మహిళా ప్రాంగణం పక్కన ఉందని పేర్కొన్నారు.



## అక్రమ మద్యం షాపులను వెంటనే తొలగించాలి

### - ఆత్రం మహేందర్ డిమాండ్

**ఇచ్చోడ, మార్చి 06, ప్రభాతవార్త:**

మండల వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నడుస్తున్న మద్యం షాపులను వెంటనే మూసివేయాలని ఏజెన్సీ పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షుడు ఆత్రం మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో, మండల కేంద్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాల వల్ల మహిళలు, యువత తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దినసరి కూలీలు మద్యపానానికి బానిసై తమ ఆదాయాన్ని మద్యం కోసమే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల వారు అనారోగ్యం పాలై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. మద్యం షాపులు పరిమితికి మించి ఉండటమే ఈ పరిస్థితికి కారణమని, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## బోల్తా పడిన ఇటుకల ట్రాక్టర్

### - ఇద్దరికి స్వల్ప గాయాలు

**ఇచ్చోడ, మార్చి 06, ప్రభాతవార్త:**

మండలంలోని తలమద్రి గ్రామ సమీపంలో ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. సిరిచెల్మ గ్రామం నుండి పొన్న ఎక్స్ రోడ్డు వైపు వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంగా వెళ్తూ ఈ ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ట్రాక్టరులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదని వెల్లడించారు.



### ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# సమర్ధవంతంగా అమలు చేయాలి

★ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు





**నస్పూర్, మార్చి 6, ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్.పి. అచల్ మహాజన్, శాసనసభ్యులు పాయల శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు ఇతర అధికారులతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అటవీ శాఖ అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజుల కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలలో కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్, రెవెన్యూ మినహా 15 రోజుల కంటె ఎక్కువగా ఎటువంటి ఫైల్ పెండింగ్ ఉండకూడదని, ప్రతి కలెక్టరేట్, రెవెన్యూ, తహసిల్దార్ కార్యాలయాలలో ఫైళ్ళ క్లియరెన్స్ సంబంధిత రిజిస్టర్ నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తుల వివరాలతో నివేదిక రూపొందించాలని, జిల్లాలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణల పురోగతిపై పూర్తి వివరాలతో నివేదిక తయారు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి నివేదిక సమర్పించాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల అసెస్మెంట్ పూర్తి చేయాలని తెలిపారు. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తాగునీటి పంపిణీ పై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలిపారు. కలెక్టర్లు విద్య, ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా సక్రమంగా చర్యలు తీసుకోవాలని, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోని సిఎంఆర్ డెలివరీ బకాయిలు ఏప్రిల్ 30 నాటికి పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులకు జిల్లా స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి సరైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. జిల్లా వారిగా, శాఖల వారీగా పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన నివేదిక సిద్ధం చేసి ఉంచాలని, జిల్లా స్థాయిలో త్వరలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని సిద్ధంగా ఉండాలని తెలిపారు.

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ 99 రోజులకు గాను ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, ఈరోజు నుంచి పారిశుధ్య ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, ఈ ఆఫీస్ ద్వారా పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్ చేయడం జరుగుతుందని, భూభారతిలో దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వివిధ స్థాయిలలో ఉన్న భవనాలు నిర్మాణ ప్రక్రియ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీటికి సంబంధించి నెలకొన్న చిన్న సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని, అమృత్ కి సంబంధించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇల్లు దశల వారీగా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేయడం జరిగిందని, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు

**క్యాతన్‌పల్లి, మార్చి 6, ప్రభాతవార్త**



రామకృష్ణపూర్ పట్టణంలోని రాజీవ్ చౌక్ ప్రాంతంలో శుక్రవారం మున్సిపాలిటీ అధికారులు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీ.డి.ఎం.ఏ అసిస్టెంట్ డైరెక్టర్ సాయికుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లు ప్రారంభించి, సంబంధిత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజుల కార్యాచరణ రూపొందించడం జరిగిందని, పది రోజుల్లో చేయబోయే పనులను వివరించారు. మున్సిపాలిటీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం, కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యాలయం లో పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్ చేయాలని, ఫైల్ పెండింగ్ ఉండకూడదన్నారు. కార్యాలయంలో ఫైళ్ళ క్లియరెన్స్ సంబంధిత రిజిస్టర్ నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణల పురోగతిపై పూర్తి వివరాలతో నివేదిక తయారు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి నివేదిక సమర్పించాలన్నారు. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తాగునీటి పంపిణీ పై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలిపారు. విద్య, ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా సక్రమంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## సమర్ధవంతంగా యాష్ నిర్వహణ..

# సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు అర్ధ సెంచరీ పైన అవార్డులు

**జైపూర్, మార్చి 6, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటైనప్పటి నుంచి యాష్ (బూడిద)ను సమర్ధవంతంగా నిర్వహిస్తూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ అర్ధ సెంచరీ పైన అవార్డులను కైవసం చేసుకుందని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జీఎం నరసింహారావు, పిసిఎస్, ఓ అండ్ ఎం జీఎం మదన్మోహన్, అధికార ప్రతినిధి కిరణ్ బాబు అన్నారు. శుక్రవారం విలేఖరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. యాష్ డిస్పోజల్‌లో భాగంగా ఫ్లై యాష్‌ను వివిధ కాంట్రాక్టర్లకు, ఇతర కస్టమర్లకు, బాటమ్ యాష్‌ని అండర్ గ్రౌండ్ మైన్స్ లకి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా కార్పొరేట్ నియమ నిబంధనలకు లోబడి మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్, మినిస్ట్రీ ఆఫ్ పవర్ కేంద్ర ప్రభుత్వ విధి విధానాలను అనుసరించి యాష్‌ను ఎప్పటికప్పుడు కస్టమర్లకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇదంతా పూర్తిగా పారదర్శకంగా ఆన్లైన్ విధానం ఈ ఆక్షన్, ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పత్రిక ప్రకటన వంటి పద్ధతులలో కస్టమర్లను ఎంపిక చేసి వారికి ఇస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ విధివిధానాలను పాటిస్తున్నామని ఇందులో ప్లాంట్ ఉన్నతాధికారుల సొంత నిర్ణయాలు ఏమీ ఉండవని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ ని ఆన్లైన్ విధానం ద్వారా టన్నుకి రూపాయల రూ.10 చొప్పున 2,10,000 టన్నులకి డి.ఆర్.కె ఎర్త్ మూవర్స్ సంస్థకి, మిగిలిన 90,000 టన్నులకు 24 పరిశ్రమలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. శ్రీ సాయి ఐఎస్బి బ్రిక్స్, ఎస్.ఆర్.ఆర్ బ్రిక్స్ ముందుకు వచ్చారని వాళ్లకి యాష్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా ఎస్. ఆర్.ఆర్ బ్రిక్స్ కంపెనీ కూడా యాష్ తరలించుటకు ముందుకు వచ్చి షావెల్ ని పెట్టుకున్నా ఇంకా లిఫ్ట్ చేయడం లేదని, ఇందులో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా కార్పొరేట్ విధివిధానాలను పాటిస్తూ ముందుగా ఎవరు వస్తే వాళ్ళకి ఫ్లై యాష్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. డి ఆర్ కె ఎర్త్ మూవర్స్ వాళ్లకి బూడిదను లిఫ్ట్ చేయాలనీ అనుమతులు ఇచ్చినప్పటికీ, సరైన సమయానికి తీసుకెళ్లలేదని దీంతో ఫ్లై యాష్ సైలో లో బూడిద నిల్వలు పెరిగిపోతున్నాయని, బూడిద సరైన సమయానికి రవాణా చేయనట్లయితే మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్‌లు భారీ మొత్తంలో జరిమానా విధిస్తాయని, డిఆర్‌కె కాంట్రాక్టర్‌కు కేటాయించినది పోను మిగిలిన బూడిదను ఐ.ఎస్.బి శ్రీ సాయి లాంటి చిన్న తరహా పరిశ్రమలకు పూర్తి ఉచితంగా జరిగిందని తెలిపారు. ఎస్టీపిపి అధికారుల మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా అందరూ ఒకే తాటిపై, సమిష్టి కృషితో, సమన్వయంతో ఎస్టీపిపి నిర్వహణ పని చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఇటీవల దిన పత్రికలలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ పై వార్త కథనాలు వస్తున్నాయని వాటిని ఖండిస్తున్నామని తెలిపారు. ప్లాంట్ అభివృద్ధిని ఓర్వలేని కొందరు వ్యక్తులు తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, అటువంటి పనులు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాష్ డి.జి.ఎం స్వామిరాజు, ఎన్విరాన్మెంట్ డి.జి.ఎం వాసుదేవ మూర్తి పాల్గొన్నారు.






## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభం

**ఇచ్చోడ, మార్చి 06, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచ్చి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ నెల 6 నుండి 15 వరకు తొమ్మిది రోజుల పాటు ఈ కార్యాచరణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు కళాశాల ఆవరణను శుభ్రపరిచి విద్యార్థులు, సిబ్బందికి అనుకూల వాతావరణాన్ని కల్పించారు. ఈ ప్రణాళికను విజయవంతం చేసేందుకు అధ్యాపకులతో వివిధ కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు, సిబ్బంది, స్థానిక కమ్యూనిటీకి ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు.



## కంచరోని చెరువు భూముల్లో ఆక్రమణల తొలగింపు

**నిర్మల్, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని కంచరోని చెరువు శిఖం భూముల్లో సాగుతున్న ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తొలగించారు. చెరువు భూముల్లో అక్రమంగా ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయించేందుకు ప్రయత్నించగా, సమాచారం అందుకున్న అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని చర్యలు చేపట్టారు. అక్కడ ఆక్రమణదారులు వేసిన మొరాన్ని పూర్తిగా తొలగించారు. చెరువు భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేషనల్ స్పీకర్

## విద్యార్థులు పరీక్షల భయం వీడాలి

**లక్షెట్టిపేట, మార్చి 06, ప్రభాతవార్త**

విద్యార్థులు పరీక్షలు అంటే భయాన్ని వీడి ధైర్యంగా రాయాలని మోటివేషనల్ స్పీకర్ సుందిల్ల రమేశ్ అన్నారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ కోటూరి రామ కళ్యాణి అధ్యక్షతన జరిగిన ఐదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు గల బాలికలకు వ్యక్తిత్వ వికాస, లక్ష్య సాధనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని విడిచి పెట్టి ఎలాంటి అపోహలకు లోను కాకుండా ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని, చదువుపై నిజమైన ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రమ శిక్షణతో ప్రణాళికా బద్ధంగా చదువుతూ సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. నిరంతరం సాధన, చెడు అలవాట్లకు, సెల్ ఫోన్లకు, సినిమాలకు దూరంగా ఉండడం, రోజుకు ఎనిమిది గంటల నిద్ర, శారీరక వ్యాయామం, మానసిక భావోద్రేకాల నియంత్రణతోనే జీవి జీవితంలో రాణించవచ్చని వివరించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించడంతోప్రారంభమైన ఈ ప్రత్యేక కార్యక్రమ ప్రాధాన్యతను గురించి, మొదట కే. మహేశ్వరరావు విద్యార్థినులకు వివరించగా, మోటివేషనల్ సెషన్ పూర్తయిన తర్వాత, కార్యక్రమం ముగింపులో ప్రిన్సిపాల్ రామ కళ్యాణి విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఇటువంటి మోటివేషనల్ సెషన్స్ వల్ల విద్యార్థినులలో దాగి ఉన్న భయాలు తొలగిపోతాయని, విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గీతాంజలి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, హెచ్. శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నిషేధిత గ్లైఫోసేట్ మందుల వాడకాన్ని ఆపాలి

**హాజీపూర్, మార్చి 6, ప్రభాతవార్త**

రైతులు పండించే పంటల్లో నిషేధిత గ్లైఫోసేట్ మందులని వాడటం ఆపాలని మంచిర్యాల డివిజన్ ఏడిఏ కృష్ణ అన్నారు. శుక్రవారం గుడిపేట రైతు వేదికలో ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మానేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యములో హెచ్‌టీ పత్తి సాగు-ప్రతికూల ప్రభావాలు, సవాళ్లు అనే అంశం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణ మాట్లాడుతూ హెచ్‌టీ పత్తి ఇది జన్యుపరంగా మార్చబడిన పత్తి రకం ఇది గ్లైఫోసేట్ అనే కలుపు సంహారిణిని తట్టుకోగలదు. భారతదేశంలో దీనికి ఇంకా అధికారిక అనుమతి లభించలేదు. పర్యావరణ ముప్పు సూపర్ వీడ్స్ గ్లైఫోసేట్ మితిమీరి వాడటం వల్ల కలుపు మొక్కలు ఆ మందును తట్టుకునే శక్తిని పొందుతాయి. దీనివల్ల భవిష్యత్తులో ఏ మందులకు లొంగని సూపర్ వీడ్స్ తయారవుతాయి. ఇది పొలంలోని సహజ సిద్ధమైన జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. మట్టిలోని మేలు చేసే బ్యాక్టీరియా, సూక్ష్మజీవులు నశిస్తాయి. గ్లైఫోసేట్ వాడకం వల్ల క్యాన్సర్ వచ్చే ముప్పు ఉంది. రక్షణ లేకుండా పిచికారి చేయడం వల్ల రైతులకు శ్వాసకోశ, చర్మ వ్యాధులు వస్తాయి. రసాయన అవశేషాలు ఆహార గొలుసులో చేరే అవకాశం ఉంది. ఇవి చట్టబద్ధమైన విత్తనాలు కావు కాబట్టి పంట నష్టపోతే బీమా రాదు. అనుమతి లేని విత్తనాలను అమ్మడం లేదా సాగు చేయడం వల్ల జరిమానాలు, జైలు శిక్ష పడే అవకాశం ఉంది అన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డివిజన్ ఏడిఏ కృష్ణ, స్థానిక కార్పొరేటర్ రాజయ్య, రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు, జిల్లా టెక్నికల్ ఏడిఏ గోపి, మంచిర్యాల ఎంఏఓ మహేందర్, దండేపల్లి ఏంఏఓ అంజిత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల డివిజన్ ఏడిఏ కృష్ణ

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా చేపట్టాలి: ఎంపీడీఓ అరుణ

**దిలావర్‌పూర్, మార్చి 06, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు. శుక్రవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ గోవర్ధన్ మాట్లాడుతూ.. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పేర్కొన్నారు. 99 రోజుల ఈ ప్రణాళికలో భాగంగా పారిశుద్ధం, తాగునీటి వసతి, ప్రభుత్వ కార్యాలయాల శుభ్రత వంటి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. మండలంలోని 12 గ్రామాలలో ఈ కార్యక్రమం నిరంతరం అమలులో ఉంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రణాళికను విజయవంతం చేసేందుకు ముందుండాలని సూచించారు. గ్రామాల్లో యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా అవగాహన కల్పించాలని కోరారు. ప్రతిరోజూ ఒక కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. మొదటిరోజు కావడంతో కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను తొలగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేందర్, కారోబారి సంతోష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ వసూళ్లపై వచ్చిన వార్తపై ఎంపీడీవో విచారణ

### - రోజులు గడుస్తున్నా తేలని నిగ్గు...?

**కుబీర్, మార్చ్ 06, ప్రభాతవార్త:**
నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని నిగ్వ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ వసూళ్లపై వచ్చిన వార్తలపై గత వారం రోజుల క్రితం ఎంపీడీవో సాగర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో వెళ్లి విచారణ చేపట్టినారు. నిరుపేద కుటుంబానికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మిక కుటుంబీకులైన బాధితుల దగ్గర నుంచి 20 వేల రూపాయలు అక్రమంగా వసూలు చేసినట్లు వార్తలలో వచ్చిన ఆరోపణలపై ఎంపీడీవో సాగర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశమై ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడినారు. అదేవిధంగా బాధితులతో కూడా మాట్లాడి చెప్పిన మాటలను ఫోన్లో రికార్డ్ చేసుకున్నారు. విచారణ చేపట్టిన నివేదికను జిల్లా అధికారులకు పంపించిన జిల్లా అధికారులు మాత్రం వారం రోజులు గడుస్తున్నా మోనంగా ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో సాగర్ రెడ్డికి వివరణ అడగగా వివరాలు తెలియాల్సి ఉంది అని అన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభం

**సారంగాపూర్, మార్చ్ 06, ప్రభాతవార్త:**
మండలంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ లక్ష్మీకాంత్ పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం నుండి 99 రోజుల పాటు ఐదు విడతల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఇందులో మొత్తం పది ప్రధాన అంశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను, పాఠశాలలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, సర్పంచులు, వార్డు సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ కోనేరు భూమన్న

**సారంగాపూర్, మార్చ్ 06, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కోనేరు భూమన్న ప్రారంభించారు. ఈ శిబిరానికి పలువురు వైద్య నిపుణులు హాజరై రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఆసుపత్రి సిబ్బంది రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు తమ అనారోగ్య సమస్యలను వైద్యులకు వివరించి చికిత్స చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, సూపర్వైజర్ కృష్ణ గౌడ్, అడెల్లి సర్పంచ్ సాయన్న, మండల నాయకులు బొల్లోజి నర్సయ్య, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# పల్లె ముంగిటకే స్పెషలిస్ట్ వైద్యం..

### - మంత్రి జూపల్లి కృష్ణారావు

**నేరడిగొండ, మార్చ్ 06, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యులతో కూడిన మెరుగైన చికిత్సను వారి ఇంటి ముంగిటకే చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గతంలో స్పెషలిస్ట్ వైద్యం కోసం గ్రామీణులు పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం రిమ్స్ నుండి ఆరుగురు నిపుణులైన వైద్యులను నేరుగా పల్లెలకే పంపిస్తోందని పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఇక్కడ ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన బాధితులకు రిమ్స్‌లో మెరుగైన చికిత్స అందేలా ఏర్పాట్లు చేస్తామని, ఇటువంటి శిబిరాలను ప్రతి నెలా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్య సేవల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రతి విభాగం అధిపతి ఉదయం రాగానే బయోమెట్రిక్ వేయడంతో పాటు వాట్సాప్ ద్వారా తమ హాజరును రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బోథ్, ఇంద్రవెల్లి ప్రాంతాల్లో త్వరలోనే డయాలసిస్ సెంటర్లను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ప్రజలు జొన్న రొట్టెలు, పప్పు వంటి పోషకాహారం తీసుకోవాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని, డయాలసిస్ సెంటర్ల ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. మండలాల వారీగా ముందస్తు ప్రణాళికతో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నామని, ప్రతి రోగి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసి ఫాలోఅప్ చేస్తున్నామని వివరించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే కలిసి టీబీ బాధితులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సర్పంచ్ ఏలేటి నీలిమ, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్, అధికారులు పాల్గొన్నారు.



## అందుబాటులో సబ్సిడీ డ్రోన్స్

**దండేపల్లి, మార్చ్ 6, ప్రభాతవార్త**
దండేపల్లి: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 40 రాయితీ మీద గరిష్ఠంగా నాలుగు లక్షల వరకు సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు పంపిణీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అంజిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళా సంఘాలు సొసైటీలు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్లు దరఖాస్తు చేసుకోగలరు మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని వ్యవసాయ విస్తరణ అధికారిని గాని లేదా మండల వ్యవసాయ అధికారులు గాని నేరుగా సంప్రదించాలి అని అన్నారు. దరఖాస్తు ఫారం, డ్రోన్ కొటేషన్, డ్రోన్ కొనుటకు సంఘం తీర్మానం, సంఘం యొక్క రిజిస్ట్రేషన్, అకౌంట్ స్టేట్మెంట్ యొక్క నకలు ఇది సంఘం యొక్క కనిష్ఠ అనుభవం కొరకు అడగడం జరుగుతుందన్నారు. ఇది పూర్తిగా పిఏసిఎస్ సొసైటీలకు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మాత్రమే అర్హులు ఇండివిజువల్‌గా దరఖాస్తుకు అనర్హులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మీ మండల వ్యవసాయ అధికారి తెలిపారు.



## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**హాజీపూర్, మార్చ్ 6, ప్రభాతవార్త**
పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భానుడి భగభగలను దృష్టిలో ఉంచుకుని, సామాన్య ప్రజల దాహార్తిని తీర్చేందుకు గుడిపేటలోని 13వ బెటాలియన్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎండల ప్రభావం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి నీరసం వచ్చే ప్రమాదం ఉన్నందున, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 5 లీటర్ల నీటిని తాగాలని ఆయన కోరారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు, బాటసారులు ఎండ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు ప్రతి ఏటా బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కమాండెంట్ తెలిపారు.ప్రయాణికులకు స్వచ్ఛమైన, చల్లని తాగునీరు అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వరరావు, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఆర్ఐ) సతీష్, ఎస్.డి.ఆర్.ఎఫ్ (ఆర్ఐ) అశోక్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు శ్రీకారం

### - 99 రోజుల అభివృద్ధి కార్యాచరణ ప్రారంభం

### - ప్రజలకు పారదర్శక పరిపాలన లక్ష్యం కమిషనర్

**మందమర్రి, మార్చ్ 6, ప్రభాతవార్త**
ప్రజాపాలనను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రజలకు నిబద్ధతతో సేవ చేయాలనే సంకల్పంతో మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన, వేగవంతమైన పరిపాలనను అందించడం అని తెలిపారు. రాబోయే 99 రోజులలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన ముఖ్య అంశాలైన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, కాలువల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారాలు అందించేందుకు మున్సిపల్ శాఖలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజా సేవలను మరింత మెరుగుపరచడానికి మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, అందరూ కలిసి పనిచేస్తే పట్టణాన్ని శుభ్రమైన, సుందరమైన, అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దగలమని కమిషనర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్లు ఈ. రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఎం.ఎ. సమీర్, జూనియర్ అసిస్టెంట్లు వి. వసంత్, బి. ప్రదీప్, వినయ్ సామ్యూల్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. గోపికృష్ణ, ఇన్‌ఛార్జ్ టి.యం.సి. ఎ. రఘురాం తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

# రక్షణతో కూడిన ఉత్పత్తితో వార్షిక లక్ష్యాన్ని సాధించాలి

**శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ - ఆర్.కె 5 గనిలో ఎస్డీఎల్ ఆపరేటర్లకు ప్రోత్సాహక బహుమతుల అందజేత**



నస్పూర్, మార్చి 6, ప్రభాతవార్త

రక్షణతో కూడిన ఉత్పత్తి ద్వారా వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 5 భూగర్భ గనిలో ఉత్పత్తి, ఉత్పాదకత అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. వార్షిక ఉత్పత్తి సాధనలో 95 శాతానికి చేరుకుని, వంద శాతం లక్ష్యానికి చేరువలో వెనకబడటం విచారకరమని పేర్కొన్నారు. మిగిలిన 20 రోజుల కాలంలో కార్మికులందరూ సమన్వయంతో కృషి చేసి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. గతంలో సింగరేణిలోనే ఉత్పత్తితో పాటు అన్ని రంగాల్లో ముందువరుసలో నిలిచిన ఆర్.కె 5 గనికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. గనిలోని 5వ సీమ్ నార్త్ సైడ్ ప్రాంతంలో మరింత బొగ్గు వెలికితీసే అవకాశం ఉందని వివరించారు. దీనివల్ల గని జీవితకాలం మరో రెండు, మూడు ఏళ్లు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు, కార్మికులు కలిసికట్టుగా పని చేసి గని భవిష్యత్తును కాపాడాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలలో అత్యధిక టబ్బులు నింపిన ఎస్డీఎల్ ఆపరేటర్లకు మునిగంటి శ్రీనివాస్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారిని ఆదర్శంగా తీసుకుని ఆపరేటర్లందరూ గరిష్ట ఉత్పత్తి దిశగా పోటీ పడాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో కోల్ కట్టర్లు, సపోర్ట్ మెన్లు, ట్రామర్, షార్ట్ ఫైరర్, సర్దార్లు పరస్పరం సహకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, గ్రూప్ ఇంజనీర్ భట్టాచార్య, రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి హరికృష్ణ, అసిస్టెంట్ మేనేజర్లు రాందాస్, వినయ్ రెడ్డి, గని పిట్ సెక్రటరీ నర్సింగరావు, అండర్ మేనేజర్లు, మైనింగ్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



## అటవీ గ్రామాల అభివృద్ధికి అటవీ శాఖ భరోసా

**- 29 కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ**

చింతలమానేపల్లి, మార్చి 06, ప్రభాతవార్త:

అటవీ ప్రాంతాలకు అనుకొని ఉన్న మారుమూల గ్రామాల అభివృద్ధికి, అక్కడి ప్రజల సంక్షేమానికి అటవీ శాఖ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని ఫారెస్ట్ రేంజ్ అధికారి సుభాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29 కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ సరిహద్దు గ్రామాల్లోని మధ్యతరగతి కుటుంబాలకు వంట గ్యాస్ సౌకర్యం కల్పించడం ద్వారా అడవులపై ఒత్తిడి తగ్గించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా కేతిని, చిత్తం, కోయపల్లి, బూరుగూడ, శివపెల్లి, దిందా, నాగేపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఈ సేవలు అందించినట్లు తెలిపారు. ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని కేవలం గ్యాస్ పంపిణీ మాత్రమే కాకుండా, రాబోయే రోజుల్లో అటవీ శాఖ పరిధిలోని గ్రామాల్లో సోలార్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం, కొత్త గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం మరియు గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో గూడెం ఉపసర్పంచ్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, ఎఫ్.ఎస్.వోలు సూర్యారావు, రాజు, ఎఫ్.బి.ఓ నవ్య, బేస్ క్యాంప్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు బీటలు బారి కుంగిపోతున్న కూడా పట్టించుకోని అధికారులు



**- బెల్లంపల్లి బస్తీ నుండి గురజాలకు వెళ్లే రోడ్డును అధికారులు పట్టించుకుని మరమ్మత్తులు చేపట్టాలి**

**- ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్**

బెల్లంపల్లి, మార్చి 6, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని ఎంసిపిఐయు పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి బస్తి నుండి వివిధ మండలాలకు వెళ్లే దారి రోడ్డు మొత్తం కృంగి, బీటలు భారీ పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం అనేది చాలా బాధాకరమని, అదే దారి గుండా కాలేజీలకు హాస్టళ్లకు విద్యార్థులు నిత్యం వెళ్తూ ఉంటారని బైకులు కానీ, ఆటోలు కానీ, ఆ రంధ్రాలల్లో టైర్లు పడి స్కిడ్ అవుతే చాలా పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఆ రోడ్డును అధికారులు పట్టించుకోకపోవడం అనేది చాలా సిగ్గుచేటని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటలు బారిన రోడ్డుకు మరమ్మత్తులు చేపించి వివిధ మండలాలకు నిత్యం వస్తూ వెళ్తున్న ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు మరమ్మత్తులు చేపించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థులకు అవగాహన అవసరం: సర్పంచ్

లింగాపూర్, మార్చి 6, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకొని బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లింగాపూర్ గ్రామ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత మరియు బ్యాంకింగ్ సేవలపై గ్రామంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలు బ్యాంకుల్లో పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా పొందే విధంగా ముందుకు రావాలని అన్నారు. గ్రామీణ ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్, రుణాలు, బీమా పథకాలపై సరైన అవగాహన ఉండాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ, ప్రజలు మోసపూరిత కాల్స్ మరియు నకిలీ సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ లాంటి సమాచారం ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. అదేవిధంగా రైతులు, మహిళా సంఘాలు, యువత కోసం బ్యాంకులు అందిస్తున్న రుణ పథకాలు మరియు సేవల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఏపీయం సూర్యకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు సిబ్బంది స్థానిక నాయకులు జాదవ్ రమేష్ రాథోడ్ భావ్ రావు జాదవ్ కైలాస్ రాథోడ్ వినోద్ చవాన్ సూరాజీ, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న సివిల్ జడ్జి సాయికిరణ్

## యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రధానోత్సవం

లక్షెట్టిపేట, మార్చి 6, ప్రభాతవార్త

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సెకండరీ బాలికల పాఠశాలలో యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ జడ్జ్ కె. సాయికిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి శైలజ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి పరీక్షల్లో పాల్గొనడం ద్వారా వారి జ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ. మండలంలోని విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు చదువులో ముందుకు రావడానికి యుఎస్ఎఫ్ఐ ఎప్పటికప్పుడు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని మొత్తం 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీ ఫలితాల్లో మండల స్థాయి మొదటి బహుమతి – ప్రభుత్వ బాలికల పాఠశాలరిషిక, రెండవ బహుమతి – ట్రినిటీ హైస్కూల్ లక్ష్మీ ప్రసన్న, మూడవ బహుమతి – ఆర్కేస్ ప్రైవేట్ పాఠశాల,దీర తీరి, విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాండ్ల సత్యనారాయణ, కారుకురి సురేందర్, చెల్లా గణేష్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది, వివిధ ప్రభుత్వ పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

**- రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి చూపాలి**

**- అవగాహన కార్యక్రమంలో ఏడీఏ బానోత్ ప్రసాద్ వాక్య**

చెన్నూరు, మార్చి 6, ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను తింటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని చెన్నూరు డీఏఓ బానోత్ ప్రసాద్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కిష్టంపేట్ రైతు వేదిక వద్ద ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన నేల ఆరోగ్యంగా ఉంటుందని, రసాయనిక ఎరువులు పురుగు మందుల వలన నేల సారం దెబ్బతినడమే కాకుండా మానవ మనుగడకే ప్రమాదమని అన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు, భూమి కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు కాలుష్యం జరిగి భూములు నిర్జీవంగా మారుతాయని తెలిపారు. దీనివల్ల అనేక రకాల క్యాన్సర్ లు, వ్యాధులు రావడమే కాకుండా మనుషులు జవసత్వాలు ఉడిగిపోయే ప్రమాదం ఉందన్నారు. అంతే కాకుండా భూమిలో పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. రైతులందరూ రసాయనిక ఎరువులు క్రమంగా వాడకం తగ్గించి వాటికి బదులుగా ఘనజీవామృతం, ద్రవజీవామృతం, నీమా అస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్య, వర్మి కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు, ద్రవ జీవన ఎరువులు ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు కే.యామిని, కిరణ్మయి, జి. శివలీల, ఈ.సాయికృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు కృషి సఖీలు, ఉద్యానవన అధికారి కళ్యాణి,సతీష్ పశు వైద్యులు, రైతులు,సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

